# అమెరికా ఆర్థిక సంక్షోభం.. భారత్‌పై ప్రభావం

**బ్యాంకింగ్ రంగ సంస్కరణలు.. వాణిజ్య బ్యాంకులు Capital Adequacy Ratio నిర్వహించడం.. ఆర్‌బీఐ పర్యవేక్షణ.. మూలధన మార్కెట్ సెబీ నియంత్రణలో ఉండటం.. ఈ కారణాల వల్లే అమెరికా ఆర్థిక సంక్షోభ ప్రభావం భారత్‌పై అంతగా పడలేదు.**

అభివృద్ధి చెందిన/ చెందుతున్న దేశాలు అమెరికా ఆర్థిక సంక్షోభ ప్రభావాన్ని చవిచూశాయి. పశ్చిమ దేశాల బ్యాంకింగ్, విత్త సంస్థలు సైతం సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. మన దేశంలోని సంస్థలపై ఈ సంక్షోభ ప్రభావం పడలేదని భావించినప్పటికీ.. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పుల నుంచి భారత్‌ను విడదీయలేం. యూరప్ బ్యాంకింగ్ సంస్థలైన ఫోర్టిస్, మెరిల్‌లించ్; అమెరికాలోని లెమన్ బ్రదర్స్, వాషింగ్టన్ మ్యూచువల్ సంక్షోభంలో చిక్కుకొని కుప్పకూలడంతో, వాటి ప్రభావం భారత విత్త వ్యవస్థపై కూడా కొంత మేరకు పడింది. ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) ఉపసంహరించుకోవడం భారతదేశంపై అంతర్జాతీయ సంక్షోభ ప్రభావంగా పరిగణించవచ్చు. నాస్కామ్ తన వృద్ధి లక్ష్యాన్ని 30 నుంచి 21-24 శాతానికి తగ్గించుకుంది. ఐటీ రంగంతో పాటు వజ్రాలు, ఆభరణాల విక్రయాలపై కూడా సంక్షోభ ప్రభావ సూచనలు కన్పిస్తున్నాయి. దీనికి సూరత్ డైమండ్ పరిశ్రమను ఉదాహరణగా తీసుకోవచ్చు. 15 నుంచి 20 శాతం వరకు డైమండ్స్‌కు డిమాండ్ తగ్గినట్లు అంచనా. 2007-08లో మొత్తం ఎగుమతుల్లో అమెరికాకు 40 శాతం వజ్రాలు, ఆభరణాలు ఎగుమతి అయ్యాయి. అమెరికా విత్త సంక్షోభం భారతదేశ వస్తు ఎగుమతులపై కొంత ప్రతికూల ప్రభావం చూపించే విధంగా ఉంది. మొత్తం వస్తు ఎగుమతులలో మన దేశం ఒక్క అమెరికాకే 10 శాతం ఎగుమతి చేస్తోంది. అత్యవసర ఆర్థిక స్థిరీకరణ చట్టం 2008 ఆధారంగా.. అమెరికాలో ఆర్థిక సంక్షోభ నివారణకు 700 బిలియన్ డాలర్ల bail out ప్యాకేజీని విత్త సంస్థలకు అందించాలని యూఎస్ ట్రెజరీ ప్రణాళిక రూపొందించింది.

## భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం :

ప్రపంచవ్యాప్తంగా సునామీలా.. వ్యాపించిన ఆర్థిక సంక్షోభ ప్రకంపనలు భారతదేశ విత్తరంగంపై కూడా కొంత ప్రభావాన్ని చూపించాయి. అయితే, ఇతర దేశాల్లోని బ్యాంకుల కంటే భారత దేశంలోని బ్యాంకులు తక్కువ రిస్క్ తీసుకోవడమే సంక్షోభ ప్రభావం తీవ్రంగా లేకపోవడానికి ప్రధానకారణం. నరసింహం కమిటీ సిఫార్సులకనుగుణంగా.. విత్త వ్యవస్థలో నియంత్రణ విధానం ఎక్కువగా ఉండటం; బ్యాంకింగ్, ఇతర విత్త సంస్థలకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు రూపొందించడం; బ్యాంకింగ్ వ్యవస్థపై రిజర్వ్ బ్యాంకు సమర్థ పర్యవేక్షణ వల్ల మన విత్త రంగం సంక్షోభ తీవ్రత నుంచి బయటపడింది. నరసింహం కమిటీ సూచించిన విధంగా.. వాణిజ్య బ్యాంకులు నిర్వహించాల్సిన capital adequacy ratioను అమలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంకు కఠినంగా వ్యవహరించడం కూడా మన

ఆర్థిక వ్యవస్థకు మేలుచేసింది. గత కొంత కాలంగా అధికవృద్ధి నమోదు చేసుకుంటున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి మందగించే సూచనలు కన్పిస్తున్నాయి. తీవ్ర ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధిలో క్షీణత, పెరుగుతున్న కరెంట్ అకౌంట్ లోటు, విదేశీ మారక నిల్వల తగ్గుదల, రూపాయి విలువ తగ్గుదల లాంటి సమస్యలను ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటోంది. విదేశీ మారక నిల్వల తగ్గుదల, రూపాయి విలువ పడిపోవడం లాంటివి ప్రత్యక్షంగా ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభానికి సంబంధించినవి. 2007- 08 ఆర్థిక సంవత్సరంలో నికర ఎఫ్ఐఐల ప్రవాహం మన దేశంలోకి 20.3 బిలియన్ డాలర్లు. కాగా, 2008 జనవరి నుంచి అక్టోబర్ 15 వరకు ఉపసంహరించుకున్న ఎఫ్ఐఐలు 11.1 బిలియన్ డాలర్లు. పెట్టుబడుల ఉపసంహరణ స్టాక్ ధరల తగ్గుదలకు దారితీసింది. దాంతో 2008, జనవరి 8 నాటికి 20,873 ఉన్న సెన్సెక్స్ 2008, అక్టోబర్ 17 నాటికి 10,000 కంటే తక్కువకు పడిపోయింది. ఎఫ్ఐఐల ఉపసంహరణ రూపాయి విలువ పడిపోవడానికి కారణమైంది. ఈ ఏడాది జనవరి 1-అక్టోబర్ 16 మధ్య కాలంలో రూపాయికి సంబంధించి కేంద్ర బ్యాంకు రిఫరెన్స్ రేటు 25 శాతం తగ్గింది. రిజర్వ్ బ్యాంకు డాలర్ల అమ్మకం చేపట్టడంతో విదేశీమారక ద్రవ్య నిల్వలు ఈ ఏడాది మార్చి చివరి నుంచి అక్టోబర్ 3 మధ్య 25.8 బిలియన్ డాలర్లు తగ్గాయి. అమెరికాలో మాదిరిగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అంతగా అభివృద్ధి చెందకపోవడం కూడా మన దేశంలో సంక్షోభ తీవ్రత కనిపించకపోవడానికి కారణం. మనదేశంలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అభివృద్ధి చెందకపోవడానికి కారణం సంస్థల మధ్య విలీనాలు తక్కువగా ఉండటమే. స్టాక్ మార్కెట్‌కు సంబంధించి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తమ పరిధిని అతిక్రమించినట్లయితే..అవి ఎక్కువ మూలధనాన్ని సమకూర్చుకోవాలి. ఇలాంటి నియంత్రణా విధానాలు స్టాక్ మార్కెట్‌లో ఎదురయ్యే ఒడిదుడుకుల నుంచి బ్యాంకులు, ఇతర విత్త సంస్థలు తమను తాము రక్షించుకోవడానికి సమర్థంగా దోహదపడగలవు. ఈ నిబంధనల వల్ల విత్త సంస్థల డివిడెంట్ పెరిగింది. బ్యాంకులు, ఇతర విత్త సంస్థల మూలధనం నిరుపయోగం కాలేదు. మరోవైపు రిజర్వ్ బ్యాంకు Basel-II నియమావళి నిష్పాక్షికంగా అమలు చేయడంతో భారతదేశ విత్త వ్యవస్థ సరైన మార్గంలో పయనించడానికి అవకాశం ఏర్పడింది.

### పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ :

భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రభుత్వరంగంలోనే ఎక్కువగా కేంద్రీకృతం కావడం ప్రస్తుత పరిస్థితుల్లో మేలుచేసింది. ప్రైవేటు యాజమాన్యంలోని బ్యాంకుల కంటే ప్రభుత్వరంగ బ్యాంకుల పైనే డిపాజిటర్లకు విశ్వాసం ఎక్కువ. దీనివల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల ద్రవ్యత్వం పెరిగింది. మూలధన అకౌంట్‌లో రూపాయి మార్పిడి పూర్తిగా అనుమతించకపోవడం కూడా ఈ సంక్షోభం సమయంలో మన దేశానికి అనుకూల అంశమైంది. సంక్షోభ ప్రారంభ సమయంలో కాకుండా.. కొంతకాలం తర్వాత అమెరికా తీసుకున్న చర్యలను మన దేశం సంక్షోభం ఏర్పడటానికి ముందే తీసుకుంది. ఇలాంటి అనిశ్చిత వాతావరణంలో బ్యాంకులు, విత్త సంస్థలు తమ పరపతి తగ్గించుకోవడం, ముఖ్యంగా ఎక్కువ

పరిమాణంలో గృహ, ఆటోమొబైల్, వ్యక్తుల కిచ్చే రిటైల్ పరపతి తగ్గించుకొన్నాయి. అనశ్వర వినియోగ వస్తు కొనుగోళ్లకు ఇచ్చే రుణాలను కూడా విత్త సంస్థలు తగ్గించాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక సంక్షోభంవల్ల ఏర్పడిన తిరోగమనం భారతదేశ ఎగుమతులు ముఖ్యంగా.. సాఫ్ట్‌వేర్, ఐటీ సంబంధితాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలు కన్పిస్తున్నాయి. విత్త రంగానికి బయట క్షీణిస్తున్న వృద్ధి వస్తు, సేవల రంగ ఎగుమతులపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఇందువల్ల ఎగుమతుల వృద్ధి తగ్గి భవిష్యత్తులో వాణిజ్యలోటు పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి. కీలక రంగాలైన టెలికాం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఆర్థిక సర్వీసులలో అమెరికా నుంచి లభించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంది. కానీ ఇప్పటికి అతిపెద్ద స్వదేశీ మార్కెట్‌ను కలిగిన భారతదేశం అభిలషణీయ ద్రవ్య విధానాన్ని అవలంభించడం ద్వారా మంచి వృద్ధి సాధించే సామర్థ్యం ఉంది.

### భారత్-సంక్షోభ నివారణ:

సంస్కరణ నిరంతర ప్రక్రియ. భారతదేశ విత్త వ్యవస్థలో ఆధునికీకరణ, సమర్థత పెంపుదలకు చికాగో బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ డా.రఘురామ్ జి. రాజన్ సమర్పించిన నివేదిక అనేక కీలక సూచనలు చేసింది. అందులోని కొన్ని అంశాలకు సంబంధించి భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. ఈ నివేదికలోని అంశాల్ని పూర్తిగా పరిశీలించి అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. దేశంలో స్టాక్ మార్కెట్ల నియంత్రణలో ఎదురయ్యే సమస్యలను సక్రమంగా నిర్వహించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా భాగస్వామ్య పత్రాల (Participatory Notes) పాత్రకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దేశంలో స్టాక్ మార్కెట్ సంక్షోభానికి విదేశాల నుంచి వస్తున్న ప్రైవేటు మూలధనమే కారణం. అవసరమైన మేరకు విదేశీ మూలధన విషయంలో 'సెబీ' రాయితీలు మంచి ఫలితాల్ని అందిస్తున్నాయి.

### అనుసరించాల్సినవి :

అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు (మన రిజర్వ్ బ్యాంకు వంటిది) కంటే భారత రిజర్వ్ బ్యాంక్ మెరుగైన నియంత్రణ విధానాలను అవలంభించినప్పటికీ.. రెండు విషయాలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకును రిజర్వ్‌బ్యాంక్ ఉదాహరణగా తీసుకోవచ్చు. వీటిలో ఒకటి.. రిజర్వ్ బ్యాంకు లాభాల పంపిణీకి సంబంధించింది. 2006-07లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు 39 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆర్జించగా... ఇందులో 34 బిలియన్ డాలర్లను అమెరికా ట్రెజరీకి బదలాయించారు. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ తీరు భిన్నంగా ఉంది. రిజర్వ్ బ్యాంకు తన లాభాలలో అధిక భాగం రూ. 50,000 కోట్ల నుంచి రూ. 60,000 కోట్ల వరకు కంటింజెన్సీ నిధికి జమచేసింది. రూ. 10,000 కోట్లను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ద్రవ్యోల్బణాన్ని లెక్కించడానికి సంబంధించి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌ను మనం అనుసరించవచ్చు. ఇక రెండోది.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని టోకు ధరల సూచీ

(WPI) ఆధారంగా కాకుండా వినియోగదారుల ధరల సూచీ (CPI) ఆధారంగా లెక్కిస్తుంది. అమెరికాలో గత సంవత్సరం ఇంధనం, ఆహారాన్ని మినహాయిస్తూ ఫెడరల్ రిజర్వ్ 'Headline Inflation' ఆధారం గా లెక్కించిన వినియోగదారుల ధరల సూచీలో పెరుగుదల 2 శాతం మాత్రమే. ఇంధనం, ఆహారం కలిపిన వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా భారతదేశంలో ద్రవ్యోల్బణం 7 శాతం మాత్రమే. కాని టోకు ధరల సూచీ ప్రకారం ప్రస్తుతం ద్రవ్యో ల్బణం 12 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని లెక్కించడానికి వినియోగదారుల ధరల సూచీని మనం పరిగణనలోకి తీసుకు న్నట్లయితే... ప్రస్తుతమున్న వడ్డీరేటు కన్నా తక్కువ వడ్డీరేట్లను మనం నిర్వహించగలం. ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంకు నగదు-నిల్వల నిష్పత్తి తగ్గిస్తూ.. విత్త సంస్థల వద్ద ద్రవ్యత్వాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవడం సంక్షోభ ప్రభావం నుంచి భారత ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడానికి తీసుకొన్న చర్యగా భావించవచ్చు. రెపో రేటు తగ్గించాలనే రిజర్వ్ బ్యాంకు నిర్ణయం కూడా అనేక ముఖ్యరంగాలకు లభ్యమయ్యే పరపతిపై వడ్డీరేట్ల తగ్గుదలకు దారితీసే అవకాశం ఉంది. దేశంలో ఉత్పాదకత దెబ్బతినకుండా ఉండే విధంగా రిజర్వ్ బ్యాంకు ద్రవ్య విధానం ఉండాలి. అనశ్వర వస్తు కొనుగోళ్లకిచ్చే పరపతి తగ్గకుండా ఉన్నపుడే పారిశ్రామికాభివృద్ధి మెరుగవుతుంది. విత్త సంక్షోభం ఎదుర్కొని దేశాలలో వాణిజ్య పరమైన సంబంధాల మెరుగుదలకు ప్రయత్నించాలి. అవస్థాపనా సౌకర్యాల కల్పనపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా నిరుద్యోగం పెరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. విత్త వ్యవస్థకు సంబంధించి నియంత్రణ విధానాలను కఠినంగా అమలు చేస్తే.. ద్రవ్య నిర్వహణ సమర్థంగా ఉంటుంది. ఉత్పాదక రంగాలకు తక్కువ వడ్డీ రేటు వద్ద పరపతి కల్పించినట్లయితే.. గత నాలుగేళ్లుగా సాధిస్తున్న వృద్ధి నిరాటంకంగా కొనసాగించే సామర్థ్యం మన ఆర్థిక వ్యవస్థకు ఉంది.

SAKSHI